సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 6 । ఆగస్టు । 2025



కేయూలో ఉద్రిక్తత
వంట చెరుకు తక్కువగా తీసుకొచ్చారని, భోజనంలో నాణ్యత లేదని కేయూలో విద్యార్థులు ఆందోళన చేశారు.
- 10లో▸



ముంపు సమస్యను ఎదుర్కోవాలి
- 10లో▸
వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని అరవింద్‌కుమార్ అన్నారు.

గరిష్టం/కనిష్టం
32.3^0 /26.1^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మోటార్లు ఏర్పాటు చేయాలి



మల్హర్: పల్లెల్లో కొత్త మోటార్లు ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. అన్సాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీకాలనీ, పుట్టపాక వాడలో మంగళవారం సబ్ కలెక్టర్ పర్యటించి, తాగు నీటిసమస్యపై పల్లెవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోర్లను బాగు చేయించి తాగు (బోరు) నీటిని అందించాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. అనంతరం చెడిపోయిన బోర్ల మోటార్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి వెన్నల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో సింగరేణి పాల్గొనాలి



భూపాలపల్లి అర్బన్: కేంద్రం ప్రభుత్వం నిర్వహిస్తున్న బొగ్గు గనుల వేలంలో సింగరేణి యాజమాన్యం పాల్గొనాలని బీఎంఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియాలోని ఓసీపీ–2లో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో శ్రీనివాస్ మాట్లాడారు. 2019 సంవత్సరం నుంచి బొగ్గు గనుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనాలని బీఎంఎస్ అనేక మార్లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ గత ప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా రెండు గనులు ప్రైవేట్ కంపెనీలకు వెళ్లినట్లు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేలా ప్రస్తుత గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుజేందర్, రాజయ్య, రఘుపతిరెడ్డి, సదానందం, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 11సంవత్సరాల నుంచి పేరుకుపోయిన సమస్యలు నేటికీ పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే అమలులోకి రావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే విద్యారంగం పట్ల ఉదాసీనత ప్రదర్శిస్తుందని ఆరోపించారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రమేష్, సేవానాయక్, అశోక్, తిరుపతి, జగపతిరావు, కుమార్ పాల్గొన్నారు.

లో లెవల్.. హై రిస్క్

ఏటా వర్షాకాలంలో తప్పని తిప్పలు
- చిన్న వరద వచ్చినా మునిగిపోతున్న వంతెనలు
- పల్లెలకు నిలిచిపోతున్న రాకపోకలు
- జల దిగ్బంధంలో పలు గ్రామాలు

భూపాలపల్లి: ఓ మోస్తారు వర్షాలు కురిసినా జిల్లాలో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. గోదావరి నది, మోరంచవాగు, చలివాగు, మానేరు, బొగ్గులవాగు లాంటి చిన్న, పెద్ద వాగులు, నదులు ఉన్న జిల్లాలో పలుచోట్ల లో లెవల్ కల్వర్టులు ఉండటం, అవి కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బ్యాక్ వాటర్, వరద నీరు కాజ్ వేలపై నుంచి ప్రవహిస్తుండటంతో గ్రామాలతో పాటు జిల్లాల మధ్య కూడా రాకపోకలు నిలుస్తున్నాయి.

పక్క ఫొటోలో కనిపిస్తున్నది పలిమెల మండలం ముకునూరు గ్రామ సమీపంలోని తోగువాగుపై నిర్మించిన లో లెవల్ వంతెన. ప్రతీ ఏటా మోస్తారు వర్షానికి సైతం తోగువాగు ఉప్పొంగి వంతెన మీదుగా వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. దీంతో పలిమెల–ములుగు జిల్లా కన్నాయిగూడెం మీదుగా రాకపోకలు నిలిచిపోతాయి. ఫలితంగా భూపాలపల్లి నుంచి ఏటూరునాగారం, కన్నాయిగూడెం, పలిమెల, మహదేవపూర్ మీదుగా భూపాలపల్లి జిల్లాకేంద్రానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏళ్ల తరబడి ఈ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నా ప్రజాప్రతినిధులు హై లెవల్ బ్రిడ్జి నిర్మించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



చిన్న వానలకే నిలుస్తున్న రాకపోకలు..



ఇటీవల కురిసిన చిన్నపాటి వానకు వరదతో నిండిన కాజ్ వే

మొగుళ్లపల్లి మండలంలోని ములకపల్లి–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న కాజ్ వే చిన్నపాటి వర్షానికి సైతం వరద నీటితో నిండిపోతుంది. దీంతో ఇరువైపులా ఉన్న గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఫలితంగా ఇతర గ్రామాల మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎనిమిది నెలల క్రితం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో వరదలు వస్తే తమ పరిస్థితి ఏంటని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు..



చిట్యాల మండలంలోని శాంతినగర్–టేకుమట్ల మండల కేంద్రం మధ్య గల లో లెవల్ కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ప్రతీ ఏటా వర్షాకాలంలో వెలిశాల గుట్టల నుంచి వరద నీరు ఈ కల్వర్టు మీదుగా సీఆర్ పల్లి వైపు వెళ్తుంది. దీంతో చిన్న వర్షానికి సైతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత ఏడాది డిసెంబర్ 1న కల్వర్టుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ ఏడాది వర్షాకాలంలో కూడా తిప్పలు తప్పేలా లేవు.

9 ఏళ్లుగా సా...గుతున్న బ్రిడ్జి నిర్మాణం..



టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి–పెద్దపల్లి జిల్లా ఓడెడు మధ్య గల మానేరు వాగుపై 2016లో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. గడిచిన 9 ఏళ్లుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టెండరు ఆహ్వానించి మానేరు వాగులో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టి రాకపోకలు సాగిస్తుంటారు. గత నెలలో కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు కొట్టుకుపోయి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సదరు బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్లు తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. అది కూడా రెండు, మూడు వర్షాలు కురిస్తే కొటుకుపోయే అవకాశం ఉంది. ఫలితంగా రెండు జిల్లాల మధ్య రాకపోకలు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడనున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

బ్యాక్ వాటర్‌తో ముప్పు..



మహదేవపూర్ మండలం చండ్రుపల్లి వాగుపై ఉన్న లో లెవల్ కల్వర్టు మీదుగా వర్షాకాలంలో గోదావరి నది బ్యాక్ వాటర్ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో అన్నారం నుంచి పలుగుల మీదుగా కాళేశ్వరం, కాళేశ్వరం మీదుగా అన్నారం వెళ్లే వాహనాల రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. సుమారు రెండు నెలల పాటు ఇదే పరిస్థితి నెలకొంటుండంతో స్థానికులు కాళేశ్వరం వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితం ఓ టూరిస్ట్ బస్సు కాళేశ్వరం వస్తుండగా వరద నీరు భారీగా వచ్చి కల్వర్టులో బస్సు చిక్కుకుంది. అప్పటి ఎస్సై శ్రీనివాస్ తాళ్ల సహాయంతో బస్సులోని భక్తులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెద్ద ముప్పు తప్పింది.

కలెక్టర్‌ను సన్మానించిన టీఎన్జీవోస్ నాయకులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: సంపూర్ణత అభియాన్‌లో భాగంగా గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మను మంగళవారం టీఎన్జీవోస్ నాయకులు సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పూల మొక్కను అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, దశరథం, షఫీ, జ్ఞానేశ్వర్‌సింగ్, సత్యనారాయణ, శ్రీదేవి, కిరణ్‌కుమార్, శంకరయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా రాజేంద్రప్రసాద్



రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్‌కు పదోన్నతి రావడంతో జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీపై వెళ్లారు. దీంతో భూపాలపల్లి మెడికల్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు.

వసతి గృహాల్లో భోజనంపై ప్రత్యేక దృష్టి

- భూ భారతి దరఖాస్తుల విచారణ వేగిరం చేయాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి వసతి గృహాల జిల్లా అధికారులు, పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్దేశిత మెనూను తప్పకుండా పాటించాలని తెలిపారు. వంట గదులు, సామాన్లు భద్రపరచు గదులు, పారిశుద్ధ్యం నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, ఆర్‌ఓ ప్లాంట్ల పనితీరు, కూరగాయలు, మాంసం, పప్పుల సరఫరాపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ మూడు రోజులకొకసారి ప్రత్యేక అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులు ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ప్రత్యేక అధికారులు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

విచారణ వేగిరం చేయాలి..

భూభారతి దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి భూభారతి దరఖాస్తుల పరిశీలనపై తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ భారతిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి విచారణ పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆదేశం ప్రకారం నిర్దేశిత సమయానికి పూర్తి చేయని తహసీల్దార్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీఓ రవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్



స్టోర్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్

అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

మొగుళ్లపల్లి: విద్యార్థుల సంక్షేమం విషయంలో అలసత్వాన్ని సహించబోమని కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం కొర్కిశాల కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యార్థినుల అస్వస్థత ఘటనపై తెలుసుకున్నారు. ఘటనపై ఎస్‌ఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈఓకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్లక్ష్యం వహించిన నలుగురు వంట మనుషులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సమస్యలు తెలియజేసేందుకు ఫిర్యాదు బాక్స్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఇన్‌చార్జ్ వైద్యాధికారి శ్రీదేవి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాం పరిశీలన

మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల గోదాంను కలెక్టర్ రాహుల్‌శర్మ తనిఖీ చేశారు. రైతులు ఎవరూ అధైర్య పడద్దని రైతులకు సరిపడా ఎరువులు, యూరియా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట డీఏఓ బాబురావు, ఏడీఏ రమేష్, ఏఓ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, సీఈఓ అప్పం సాగర్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గట్టయ్య

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని సింగరేణి గనుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని సింగరేణి గనుల్లో గాలి కొరత, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సరైన పనిముట్లు లేవన్నారు. యంత్రాలకు మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలమైనట్లు ఆరోపించారు. ఈ సమస్యలపై అధికారులతో మాట్లాడితే పరిష్కరించకపోగా కార్మికులను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు దాసరి జనార్దన్, శ్రీనివాస్, బాబు, జయశంకర్, నరసింహారెడ్డి, సలీం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వాగు దాటుతూ ట్రాక్టర్ పల్టీ

వెంకటాపురం(కె): పాత్రాపురం గ్రామ సమీపంలోని పాలెంవాగు దాటుతుండగా ట్రాక్టర్ పల్టీకొట్టింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాత్రాపురం గ్రామ సమీపంలోని గోదావరి లంకల్లో పాలెం, పాత్రాపురం, వీరభద్రవరం గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయం చేపట్టారు. ఈ క్రమంలో వీరభద్రవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ గోదావరి లంకలో దుక్కిదున్నే పనుల నిమిత్తం వెళ్లేందుకు పాలెంవాగు దాటుతుండగా వాగు ఉధృతికి ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు పైన కూర్చొని ఉన్న మరో ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.



ప్రమాదకరంగా..

మల్హర్ మండలంలోని కొయ్యూరు, మంథని ప్రధాన రహదారి పరిధిలోని కొయ్యూరు సబ్‌స్టేషన్ పరిధిలోని రోడ్డుకు ఇరువైపులా ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. చెట్లు ఎప్పుడు కూలిపోతాయో అని వాహనదారులు భయపడుతున్నారు. వర్షాకాలం కావడంతో ఈదురు గాలులకు చెట్లు పడే ప్రమాదం ఉంది. పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిన చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

- మల్హర్

చిన్నపాటి వర్షానికే..



గణపురం మండలకేంద్రంలోని పరకాల–ములుగు ప్రధాన రహదారి చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. మంగళవారం కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి కుంటలను తలపించింది. గుంతలు ఏర్పడక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి నీరు నిలవకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

- గణపురం

'మిషన్ భగీరథ' నిర్లక్ష్యం



గణపురం గణపసముద్రం చెరువు నుంచి మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్‌లైన్లు వేసి నియోజకవర్గంలో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వందలాది కిలోమీటర్లు పైప్‌లైన్లు చేశారు. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో గణపురం మండలకేంద్రంలో ధర్మరావుపేట ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్లు రోడ్డుపైకి తేలాయి. వాహనాలు పైప్‌లైన్లపైకి ఎక్కితే పగిలే అవకాశం ఉంది.

- గణపురం

యశోద మెడికల్ సెంటర్

యశోద హాస్పిటల్స్

1వ అంతస్థు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
[illegible] మెదడులో గడ్డలు, రక్త స్రావం, చేయి గడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తల నొప్పి, పార్కిన్సన్ మరియు ఫిట్స్ వ్యాధులకు, డిస్క్ సమస్యలు, వెన్నుపాము గడ్డలు, ఫ్రాక్చర్ మరియు క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు	[illegible]	08-08-2025 2వ శుక్రవారం ఉదయం10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible] కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, [illegible] కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమోడయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు	[illegible]	
[illegible] అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణుతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	[illegible]	
[illegible] ఛాతిలో నొప్పి, ఊపిరి ఆడకపోవడం (ఆయాసం), గుండె త్వరగా కొట్టుకోవడం, [illegible]	[illegible]	09-08-2025 2వ శనివారం ఉదయం10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible] దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవటంలో కష్టం, ఊపిరితిత్తుల క్యాన్సర్, [illegible]	[illegible]	
[illegible] అన్ని రకముల రక్త నాళాల వ్యాధులు, [illegible]	[illegible]	12-08-2025 2వ మంగళవారం ఉదయం10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible] మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, [illegible]	[illegible]	13-08-2025 2వ బుధవారం ఉదయం10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible] గుండె దడ, [illegible]	[illegible]	
[illegible] మోకాళ్ళు, తుంటి, మోచేయి, కీళ్ళ మార్పిడి, మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	[illegible]	14-08-2025 2వ గురువారం ఉదయం10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible] ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ములో క్యాన్సర్, [illegible]	[illegible]	
[illegible] ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, మైలోమా, రక్తహీనత, రక్త సంబంధిత వ్యాధులు [illegible]	[illegible]	

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542

క్లుప్తంగా

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

హన్మకొండ: అవినీతి ఉద్యోగులపై టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం వేటువేసింది. ఖమ్మం సర్కిల్‌లోని తిరుమలయపాలెంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్.భాస్కరరావు, ఏఎల్ఎం యు.జగత్ జీవన్ అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడి కావడంతో సస్పెండ్ చేసింది. ఈ విషయాన్ని యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సర్కిల్ పరిధిలోని చింతల్‌తండా రైతులు కొత్త వ్యవసాయ సర్వీసుకు దరఖాస్తు చేసుకోగా, మంజూరు చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. తాము అంత మొత్తం చెల్లించుకోమని చెప్పి చివరకు రూ.90 వేలు అందించారు. ఈవిషయం యాజమాన్యం దృష్టికి రావడంతో విజిలెన్స్ విచారణ చేపట్టగా..రైతుల నుంచి రూ.90 వేలు తీసుకున్నట్లు వెల్లడైంది. దీంతో వారిని సస్పెండ్ చేసింది. ఎవరైనా అవినీతికి పాల్పడితే 92810 33233 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని యాజమాన్యం కోరింది.

ఎస్జీటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విద్యారణ్యపురి: స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మంగళవారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో ఎస్జీటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగింది. హనుమకొండ జిల్లాకు సంబంధించి సీనియారిటీ తాత్కాలిక జాబితాను వెల్లడించడంతో 460మందిని సర్వీస్‌బుక్స్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచారు. మొత్తం 8 కౌంటర్లను ఏర్పాటుచేసి పరిశీలన జరిపారు. 360మంది వరకు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అందరి వెరిఫికేషన్ పూర్తయ్యాక మరోసారి సీనియారిటీ జాబితా వెల్లడిస్తారు.

చేయూత పెన్షన్ సకాలంలో అందించాలి

హన్మకొండ: చేయూత పెన్షన్లను ముఖ గుర్తింపు పద్ధతి ద్వారా సకాలంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేయాలని, ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేయూత పెన్షన్ రాష్ట్ర డైరెక్టర్ గోపాల్ రావు సూచించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో వరంగల్ జిల్లా ఎంపీడీఓలు, సెక్షన్ క్లర్కులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, బిల్ కలెక్టర్లకు చేయూత పెన్షన్‌లపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయతీలోని రిజిస్టర్‌లో పెన్షన్ పంపిణీ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మరణించిన పెన్షన్‌దారులను వెంటనే ఆన్‌లైన్‌నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సదస్సులో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

కేయూలో ఉద్రిక్తత

కామన్ మెస్‌లో విద్యార్థుల ఆందోళన



కేయూ కామన్ మెస్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



కేయూలోని అకడమిక్ కమిటీ హాల్‌లో కామన్ మెస్ కమిటీ బాధ్యులతో సమావేశమైన వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్

- 13 టన్నులు రావాల్సిన కట్టెలను తక్కువగా తీసుకొచ్చారని ఆరోపణ
- కూరగాయల సరఫరాలో కూడా అవకతవకలు..
- భోజనం నాణ్యతగా ఉండటం లేదని కేర్‌టేకర్, డైరెక్టర్‌తో వాగ్వాదం
- పోలీసులు నచ్చజెప్పినా వినని విద్యార్థులు
- మెస్ కమిటీ బాధ్యులు, విద్యార్థులతో వీసీ సమావేశం
- కేర్‌టేకర్, సూపర్‌వైజర్లను తొలగిస్తున్నట్లు ప్రకటన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్ వద్ద విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. కామన్‌మెస్‌లో వంటచేసేందుకు లారీలో 13టన్నుల లోడ్ కట్టెలు రావాల్సిండగా ట్రాక్టర్‌లో తక్కువగా తీసుకురావడంతో మెస్ కమిటీ బాధ్యులు ప్రశ్నించారు. లారీలో 12నుంచి 13టన్నులు రావాల్సిన కట్టెలను ట్రాక్టర్‌లో తక్కువగా ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. ఈసందర్భంగా సంబంధిత సిబ్బందితోనూ, అక్కడున్న కేర్‌టేకర్‌తోనూ వాగ్వాదానికి దిగారు. జాయింట్ డైరెక్టర్ అక్కడికి చేరుకోగా డైరెక్టర్ రావాలని డిమాండ్ చేశారు. దీంతో సమాచారం అందుకున్న కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ కామన్ మెస్ వద్దకు చేరుకోగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. లారీలోడ్‌కు బదులుగా సంబంధిత కాంట్రాక్టర్ ట్రాక్టర్‌లో కట్టెలు పంపారని ఇలా మిగతా వాటిల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. కూరగాయలు సరఫరా చేసేవారు కూడా తక్కువగానే తీసుకొస్తున్నారని, భోజనం నాణ్యతగా ఉండటంలేదన్నారు. కామన్ మెస్‌లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మెస్ కమిటీ బాధ్యులు పలువురు, విద్యార్థులు హాస్టళ్ల డెరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. హాస్టళ్ల నిర్వహణకు కమిటీ కూడా ఉంటుందని వీసీ, రిజిస్ట్రార్ వద్దకు వచ్చి మాట్లాడాలని మెస్ కమిటీ బాధ్యులకు, విద్యార్థులకు డైరెక్టర్ సూచించారు. ఆందోళన సమాచారం అందుకున్న కేయూ పోలీస్‌స్టేషన్ సీఐ రవికుమార్, ఎస్‌ఐ రవీందర్ ఇతర పోలీస్ సిబ్బందితో అక్కడి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. పోలీసుల సమక్షంలోనూ డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీస్ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. యూనివర్సిటీ అధికారులతో మాట్లాడాలని సూచించగా వీసీని కలిసేందుకు వెళ్లారు.

కట్టెల సరఫరా కాంట్రాక్టు రద్దు..

కాకతీయ యూనివర్సిటీ కామన్‌మెస్‌కు కట్టెలను సరఫరా చేసే కాంట్రాక్టర్ కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య ఎల్‌పీ రాజ్‌కుమార్ తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు సమాచారం ఇచ్చామన్నారు.

వీసీతో సమావేశం..

మెస్ కమిటీ బాధ్యులు, కొందరు విద్యార్థులు కేయూలోని పరిపాలనా భవనం వద్దకు వచ్చారు. కేయూ వీసీ ఆచార్య కే ప్రతాప్‌రెడ్డి మెస్ కమిటీ బాధ్యులతో అకాడమిక్ కమిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మెస్ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. మెస్‌లో అవకతవకలకు పాల్పడుతుండడంతో భోజనం నాణ్యతగా ఉండటం లేదని ఆరోపించారు. సూపర్‌వైజర్ నిరంజన్‌రెడ్డి, కేర్‌టేకర్ రాజు, హాస్టళ్ల డైరెక్టర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. దీనికి వీసీ స్పందిస్తూ.. కేర్‌టేకర్ రాజును, సూపర్‌వైజర్ నిరంజన్‌రెడ్డిని కామన్‌మెస్ విధుల నుంచి తొలగిస్తున్నట్లు విద్యార్థులకు తెలిపారు. హాస్టళ్ల డైరెక్టర్‌ను కూడా మార్చాలని విద్యార్థులు డిమాండ్ చేయగా..ప్రస్తుతం హాస్టళ్ల డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వర్తించేందుకు ఎవరూ ముందుకు రావటం లేదని, త్వరలోనే కామన్‌మెస్ వ్యవహారంపై అవసరమైతే ఓ కమిటీ నియమిస్తామని, హాస్టళ్ల డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ కొనసాగుతారని తెలిపారు. ఏమైనా సమస్యలు తలెత్తితే రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

యూరియా వచ్చిందయా!

- రైల్వే గూడ్స్‌షెడ్‌కు చేరిన యూరియా వ్యాగన్
- ఉమ్మడి జిల్లాకు 1,319.220 మెట్రిక్ టన్నులు కేటాయింపు
- అన్ని మండలాల్లో తగినంత యూరియా ఉంది: అధికారులు



రైల్వే గూడ్స్ షెడ్‌లో వ్యాగన్ నుంచి యూరియా బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న హమాలీలు

ఖిలా వరంగల్: యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట లభించింది. మంగళవారం మధ్యాహ్నం వరంగల్ రైల్వేస్టేషన్‌లోని గూడ్స్‌షెడ్‌కు వ్యాగన్ చేరింది. ఉమ్మడి జిల్లాలోని రైతులకు అందించేందుకు ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన యూరియా 1,319.220 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ యూరియాను మార్క్‌ఫెడ్‌కు 60శాతం, ఇతర ఫర్టిలైజర్స్‌కు 40శాతం కేటాయించారు. మార్క్‌ఫెడ్ అధికారులు ప్రధానంగా ఎక్కడ కొరత ఉందో ఆ ప్రాథమిక సహకార సంఘాలకు లారీల్లో తరలించేందుకు సిద్ధమయ్యారు. ఈ సీజన్‌లో కావాల్సిన యూరియా మొత్తంలో 60శాతం పైగా ఇప్పటికే చేరింది. తాజాగా వచ్చిన దానితో సమస్యలు తీరినట్లేనని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రైతులు యూరియా దొరకదనే ఆపోహలకు గురికాకుండా ఒకటి, రెండు బస్తాలు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. వీటి అమ్మకాలు పూర్తయితే మరింత వచ్చే వీలుందని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులున్నా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. దాదాపు అన్ని మండలాల్లో తగినన్ని నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఒకేసారి కొనుగోలు చేయడం, కొనుగోలు చేసిన మొత్తాన్ని ఒకేసారి చల్లలేరని, తీసుకున్న యూరియాను పంటకు ఎక్కువగా చల్లడం వల్ల నష్టాలు వస్తాయని చెప్పారు. రైతులు ఎకరానికి 25 కిలోలకు మించి వినియోగించొద్దని అధికారులు సూచించారు.

టీవీ రిపేర్ పేరుతో ఇంట్లో చోరీ



చిందరవందరగా ఉన్న బీరువాలోని వస్తువులు

నడికూడ: టీవీ మరమ్మతు చేస్తానంటూ వచ్చి ఓ ఇంట్లో దొంగతనం చేసిన ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరకాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాలీబ్ రాజు తన భార్యతో సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న తల్లిదండ్రుల వద్దకు 11 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి 'మీ కొడుకు టీవీ రిపేరు చేయమన్నాడు..' అని చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. టీవీ గదిలో ఉన్న బీరువా తాళం పగలకొట్టి రూ.లక్షా 38 వేల విలువ గల రెండు బంగారు ఉంగరాలు, ఒక జత కమ్మలు, మాటీలు, బంగారు చైన్, వెండి పట్టగొలుసు, నగదు రూ.11,000 చోరీ చేసి.. టీవీ రిపేర్ పూర్తయ్యిందని చెప్పి వెళ్లిపోయాడు. 20 నిమిషాల అనంతరం రాజు తల్లిదండ్రులు ఇంటి లోపలికి వెళ్లిచూడగా బీరువా పగలగొట్టి ఉండడం గమనించి తమ కుమారుడికి సమాచారం ఇచ్చారు. బాధితుడు రాజు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

రామప్ప హుండీ ఆదాయం రూ.5.58 లక్షలు





ఆలయ హుండీ కానుకలను లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు(ఇన్‌సెట్‌లో) పరమశివుడి అలంకరణలో దర్శనమిస్తున్న రామలింగేశ్వరస్వామి

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప దేవాలయానికి గత మూడు నెలలల్లో రూ.5,58,506 హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్ తెలిపారు. గత మూడు నెలలుగా భక్తులు, పర్యాటకులు హుండీలో వేసిన కానుకలను మంగళవారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకులు కవిత ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబిక సేవా సమితి సభ్యులు హుండీ కానుకలను లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరమశివుడి అలంకరణలో రామలింగేశ్వరస్వామి

రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వరస్వామి మంగళవారం పరమశివుడి అలంకరణలో పర్యాటకులకు, భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కోమల్లపల్లి హరీశ్‌శర్మ తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా రామలింగేశ్వరస్వామికి రోజుకో అలంకరణ చేస్తున్నట్లు వెల్లడించారు.

ముంపు సమస్యను ఎదుర్కోవాలి

- ముందస్తు ప్రణాళికలతో అధికారులు సిద్ధంగా ఉండాలి
- రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్
- కన్నాయిగూడెంలో సమ్మక్క బ్యారేజీ పరిశీలన
- ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో వరద ముంపుపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ దివాకర టీఎస్, పీఓ చిత్రామిశ్రా తదితరులు



సమ్మక్క బ్యారేజీ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న అరవింద్‌కుమార్

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా సమాయత్తం కావాలని, గతంలో వరద ముంపుతో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కావొద్దని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి జిల్లాలోని కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజీ నీటినిల్వలు, గేట్ల వివరాలను పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి నీరు ఎంత వరకు వస్తుందని, ఏ మేరకు నీటిని విడుదల చేస్తారని ఆరా తీశారు. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎగువన ఉన్న లక్ష్మీ, సరస్వతీ, ఎస్సారెస్పీతోపాటు ఎగువన ఉన్న నదులు, ఉపనదుల నుంచి బ్యారేజీలోకి చేరుతుందని దివాకర తెలిపారు. బ్యారేజీ వద్ద ఉన్న 59 గేట్లను ఎత్తి దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. బ్యారేజీ ఎగువన దేవాదుల ఎత్తిపోతల వద్ద 10 మోటార్లు మూడు ఫేజ్‌లలో ఉన్నాయని, దిగువన ఉన్న రిజర్వాయర్‌ల నీటి వినియోగాన్ని బట్టి పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ..వరదల ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికల్లో భాగంగా ముంపు ప్రాంతాలను గుర్తించడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

ఈసందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ..వర్షాకాలంలో తక్షణ చర్యలకు అవసరమైన సిబ్బందిని, వాహనాలను సిద్ధంగా ఉంచామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్, టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 80 పునరావాస కేంద్రాలను ముందస్తుగా గుర్తించామన్నారు. బెడ్ షీట్లు, ఆహారం అందించేలా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24/7గా పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ వెంకటేశ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్‌సింగ్, ఏపీఓ వసంతరావు, ఇరిగేషన్ అధికారి అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాలీఆటో ఢీకొని చిన్నారి మృతి



కాలేశ రిషిక(ఫైల్)

కమలాపూర్: ట్రాలీఆటో ఢీకొని 15 నెలల చిన్నారి మృతిచెందింది. ఈఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడులో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుండేడుకు చెందిన కాలేశ శ్రీకాంత్, తిరుమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు రిషిక ఇంటిముందు ఆడుకుంటుండగా హసన్‌పర్తికి చెందిన గుండమీది శ్రీనివాస్ అనే వ్యక్తి ట్రాలీఆటోకు మైక్ పెట్టుకుని పెద్ద శబ్దంతో అల్లం, వెల్లుల్లి అమ్ముకుంటూ.. అతివేగంగా ఆటో నడుపుకుంటూ వచ్చి రిషికను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో రిషిక అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ పారిపోయాడు. అప్పటివరకు తమతో ఆడుకున్న రిషిక రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రిషిక తండ్రి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు గుండమీది శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

జ్వరంతో యువతి..



దీపిక(ఫైల్)

వాజేడు: ఏజెన్సీలో జ్వరంతో బాధపడుతున్న ఓ యువతి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండలం కోయవీరాపురం గ్రామానికి చెందిన ఉయిక దీపిక (22) కొన్ని రోజులుగా జ్వరంతో బాధ పడుతోంది. గత నెల 29న వాజేడు వైద్యశాలలో చేరగా పరీక్షలు చేసి రెండు రోజులు వైద్యం అందించారు. ప్లేట్‌లెట్లు తక్కువగా ఉన్నట్లు తెలపడంతో వెంటనే ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేరగా నాలుగు రోజులు వైద్యం చేశారు. కుడివైపున నొప్పి వస్తుందని దీపిక తెలపడంతో పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ వెళ్లాలని సూచించారు. వరంగల్‌కు తరలించి వైద్యం అందిస్తుండగానే దీపిక సోమవారం రాత్రి మృతి చెందింది. దీపిక బీఈడీకి ప్రిపేర్ అవుతుంది. మృతురాలి తండ్రి రామారావు నాలుగు సంవత్సరాల క్రితం చనిపోగా, తల్లి దేవమ్మ, అన్న కలిసి దీపికను చదివిస్తున్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వృద్ధుడు..

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం బూజునూర్‌పల్లికి చెందిన మామిడాల ఇంద్రారెడ్డి (60) అనే వృద్ధుడు సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఇంద్రారెడ్డి సోమవారం గొర్రెకొట్టడానికి వెళ్లి సాయంత్రం గొర్రెను, ఎద్దులను కడగటానికి దగ్గరలో ఉన్న వాగు వద్దకు వెళ్లాడు. ఎద్దులను కడిగిన అనంతరం గొర్రె కడుగుతుండగా ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. రాత్రయినా ఇంద్రారెడ్డి ఇంటికి రాకపోవడంతో స్థానికులతో కలిసి కుటుంబసభ్యులు ఇంద్రారెడ్డి కోసం వెతికారు. వాగు వద్ద ఎద్దులు, గొర్రె, వాగులో ఇంద్రారెడ్డి మృతదేహం కనిపించింది. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి

- జూలై 31న రైలు ఎక్కబోతూ జారిపడడంతో తీవ్రగాయాలు



జగదీశ్వర్(ఫైల్)

ఖిలా వరంగల్: చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కబోతూ ఓ వ్యాపారి వరంగల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ వద్ద జారిపడి తీవ్రగాయాలు కాగా.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రామన్నపేటకు చెందిన వ్యాపారి చందా జగదీశ్వర్ (62) గత నెల 31న ఉదయం 8.30 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కబోతూ ప్రమాదవశాత్తు ప్లాట్‌ఫామ్ మధ్యలో పడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కాగా.. రైల్వే జీఆర్పీ అధికారులు హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం జగదీశ్వర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతుడి కుమారుడు అభిషేక్‌కు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబల్‌రాజు పేర్కొన్నారు.

ప్రజాసమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సభలో మాట్లాడుతున్న కూనంనేని

ములుగు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలను పట్టించుకోవటం లేదని, ప్రభుత్వాలు మారుతున్న పేదరికం మాత్రం పోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ములుగు జిల్లాలో పేదరికం అధికంగా ఉందని, ఎలాంటి అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొద్దిమంది ఆస్తులు పెంచుకోవటం కోసమే పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంపాల రవీందర్, అహ్మద్ పాషా, భిక్షపతి, రాజు, తోట మల్లికార్జునరావు, బండి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ వందశాతం పూర్తి చేయాలి

- రాష్ట్ర సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు(డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్) వందశాతం పూర్తిచేయాలని రాష్ట్ర సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం భీమారంలోని స్కిల్‌స్టోర్క్ స్కూల్‌లో నిర్వహించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రభుత్వ, జిల్లా పరిషత్ హెడ్మాస్టర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు..పాఠశాలల్లో విద్యార్థుల హాజరును పెంచాలన్నారు. యూడైస్‌లోని తేడాలను వెంటనే సరిచేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జావేద్, వరంగల్ డీఈవో మామిడాల జ్ఞానేశ్వర్, హనుమకొండ, వరంగల్ ప్లానింగ్ కోఆర్డినేటర్లు మహేశ్, విజయ్‌కుమార్, సహాయ గణాంక కోఆర్డినేటర్లు రఘుచంద్ర, వేణుగోపాల్, డీఈ రవీందర్, ఏఈ అజీజ్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ సందర్శన..

అంతకుముందు కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను రాష్ట్ర సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్ సందర్శించారు. అక్కడ యూడైస్‌లో నమోదై ఉన్న విద్యార్థుల సంఖ్యకు పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు తేడా ఉందనే విషయంపై ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. నర్సంపేటలోని మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు.

పాలకుర్తిలో గంజాయి గుప్పు

- పోలీసుల అదుపులో 11మంది?

పాలకుర్తి టౌన్: గంజాయి మత్తు పల్లెలను కమ్మేస్తోంది. యువకులు మత్తుకు బానిసలవుతున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి మత్తు ఇప్పుడు పల్లెలకు విస్తరించి యువత భవిష్యత్తును అంధకారం చేస్తోంది. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో భారీగా గంజాయి వ్యాపారం కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలకుర్తి సోమవారం వారాంతపు సంతలో గంజాయి తాగుతున్న ఏడుగురు యువకులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. పోలీసులను చూసి కొంతమంది పారిపోయినట్లు తెలిసింది. పారిపోయిన యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. గంజాయి తాగుతూ పట్టుబడిన వారిలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల చెందిన ఓ యువకుడు, పాలకుర్తి మండల కేంద్రానికి చెందినవారు ముగ్గురు, గూడూరు గ్రామానికి చెందిన వారు ముగ్గురు ఉన్నట్లు తెలిసింది. వీరిచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అందులో ఓ మహిళ ఉందని, ఆమె గంజాయి విక్రయదారుగా భావిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

Wgl-Hyd మెయిన్ రోడ్‌కి రాంపూర్ కపిల్ ఫుడ్స్ బ్యాక్ సైడ్, 2nd బిట్ ఈస్ట్ నార్త్ వెస్ట్ ప్లాటు 3 పక్కల 30ft రోడ్డు కలదు. టోటల్ యార్డ్స్ 1433 అమ్మబడును. సంప్ర॥ 9849121543. [SCA25007025]

నాయుడు పెట్రోల్ పంపు ఎదురుగా మెయిన్ రోడ్డుకు తూర్పు ఫేస్ తో వె: 44ft x పొ: 85ft గల ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9849121543. [SCA25007024]

FLATS FOR SALE

Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6753]

SERVICES

CHANGE OF NAME

I, KORE BHARATHI (old Name) W/o. Siddaiah R/o. RC-No 121, 9th Block, Ramappa colony, Bhupallpally (M), Jayashankar Bhupallpally dist. I have changed my name as MEKA RAJAMMA (New Name), W/o. Siddaiah for all purposes, Both are same person. [SCA25007038]

CHANGE OF NAME

I, FARZANA QATOON, W/o. SYED MOHAMMED MOAZZAM HUSSAIN (Old name), Age 56 yrs, R/o. H.No.1-9-1027, Postal Colony, Basith Nagar, Subedari, Hanumakonda District-506001 have changed my name as FARZANA KHATOON, W/o. SYED MOHAMMED MOAZZAM HUSSAIN (New Name) for all purposes. [WA-6756]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

WANTED

Multinational Company Part Time / Full time work Training / Support Given. Contact No: 8106144217. [WA-6754]

FACULTY TEACHERS

Wanted Teachers from Warangal City Only High School: Telugu Primary: All subjects. Note: Whatsapp your applications to 7032158668. Shantiketan High School, Durgeshwara Swamy Temple Lane, Warangal. [WA-17810]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.